క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



లాడ్జీలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎస్పీ విజయకుమార్, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ప్రతి లాడ్జిలోనూ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ విజయకుమార్ నిర్వాహకులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని లాడ్జిలు, హోటళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కొత్త వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా వ్యక్తులకు గదులు అద్దెకు ఇవ్వరాదన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడంతోపాటు లాడ్జిలో బస చేసే వారి పేరు, ఊరు, సమయం నమోదు చేయాలన్నారు. లాడ్జి పరసర ప్రాంతాలు కనబడేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ వెంట సీఐ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

జనరల్ సర్జరీ శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నేతాజి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని స్పందన ఆస్పత్రిలో ఆదివారం జనరల్ సర్జరీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాప్రాస్కోపిక్ సర్జన్ డాక్టర్ నేతాజి 94 మందికి ఉచితంగా పరీక్షించి మందులు అందించినట్లు స్పందన ఆసుపత్రి వైద్యులు డాక్టర్ టీఎం బషీర్, వైసోనియా తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

ఘనంగా గోల్డెన్ జూబ్లీ



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రవీంద్రరెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోటా మున్సిపల్ పాఠశాలలో ఆదివారం ధర్మవరం మున్సిపల్ టీచర్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ టీచర్స్ క్రెడిట్ సొసైటీ 1975లో స్థాపించారన్నారు. అప్పట్లో రూ.500 రుణ సౌకర్యంతో మొదలై నేడు రూ.3 లక్షల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తూ మున్సిపల్ టీచర్స్‌కు 50 ఏళ్లుగా సేవలు అందిస్తోందని తెలిపారు. రూ.80 లక్షల టర్నోవర్ ఉందని సొసైటీ కార్యదర్శి రామకృష్ణనాయక్ తెలిపారు. సొసైటీకి సహకరించిన సభ్యులందరికి బ్యాగులను అందించారు. అకౌంటెంట్ పార్థసారథిని శాలువాలతో సన్మానించారు. సొసైటీ సభ్యులు రమేష్‌బాబు, అమానుల్లా, రాంప్రసాద్, అంజినాయక్, సాయిగణేష్, పాఠశాలల హెచ్ఎంలు డి.రాంప్రసాద్, లక్ష్మీనారాయణరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

పుట్టపర్తి టౌన్: కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేద్దామని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వేమయ్య యాదవ్ యూనియన్ నేతలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర చౌదరి ఆధ్వర్యంలో జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకుండా కార్పొరేట్లకు కొమ్ముకాసేలా వ్యవరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీ మధునాయక్, నేతలు రమేష్, సంపూర్ణమ్మ, వెంకటేష్, రమణ, జయలక్ష్మి, మారుతీరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కేటాయింపు ఒకే రకంగా ఉండాలి

పెనుకొండ: పాఠశాల విద్యా సంస్కరణలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు, బేసిక్ ప్రైమరీ పాఠశాలలపై వివక్షత చూపకూడదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుతి ప్రసాద్, జయకృష్ణ అన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్ల బోధన ఉండాలంటే ఎంత దూరమైనా హైస్కూల్‌కు వెళ్లాల్సి ఉందని, ఇది సరైంది కాదన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల కేటాయింపులో సమానత ఉండాలన్నారు.

కలవరం రేపుతున్న అదృశ్యం

- పది నెలల్లో 45 మంది మిస్సింగ్
- నేటికీ కానరాని ఏడుగురి జాడ
- ఆందోళనలో బాధిత కుటుంబాలు



అదృశ్యమైన సయ్యద్ సత్తార్ (ఫైల్)



సత్యనారాయణ (ఫైల్)



కదిరి టౌన్: కదిరి ప్రాంతంలో మిస్సింగ్ కేసులు కలవరం రేపుతున్నాయి. ప్రతి నెలా సగటున ఐదుగురు అదృశ్యమవుతున్నారు. అసలు ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. కదిరి, పరిసర ప్రాంతాల్లో గడిచిన పది నెలల్లో 45 మంది వరకూ మిస్సింగ్ అయ్యారు. ఇందులో మైనర్ బాలికలు, రుణగ్రస్తులు, భార్యాభర్తలు తదితరులు ఉన్నారు. అప్పుల వారి ఒత్తిళ్లు భరించలేక కొందరు ఊరు విడిచిపోతున్నట్లు తెలిసింది. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణకు లోనై ఇల్లు విడిచి వెళ్లిపోతున్న మైనర్లు ఇంకొందరు. కుటుంబంలో కలహాలు, మనస్పర్థలు, వేధింపులు తట్టుకోలేక అదృశ్యమవుతున్న వారు ఇంకొందరు. భూ తగాదాల నేపథ్యంలోనూ మిస్సింగ్ అవుతున్న వారూ లేకపోలేదు. బాధిత కుటుంబ సభ్యులు పలు చోట్ల వెదికి ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు ఇప్పటికీ ఏడుగురి జాడ కనుగొనలేకపోయారు. ఇందు కోసం రెండు బృందాలతో గాలింపు చేపట్టామని పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

నా కొడుకు ఏమయ్యాడో?

మేం సైదాపురం సమీపంలోని అద్దె ఇంట్లో ఉంటున్నాం. నా కుమారుడు సత్తార్ మార్చి మూడో తేదీ నుంచి కనిపించడం లేదు. తెలిసిన చోట్లల్లా వెదికాం. ఎక్కడా కనిపించలేదు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అయినా ఇంతవరకూ జాడ లేదు. మా కొడుకు ఏమయ్యాడో అర్థం కావడం లేదు. ఆందోళనగా ఉంది.

– జమీర్, కదిరి

ఆయన కోసం ఎదురుచూస్తున్నాం

నా భర్త సత్యనారాయణ కనిపించకుండా పోయి మూడు నెలలు అవుతోంది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు ఆయన జాడ గురించి ఎటువంటి సమాచారమూ రాలేదు. ఆయన ఇంటికి ఎప్పుడు వస్తాడా అని నేను, పిల్లలు ఎదురు చూస్తున్నాం. పోలీసులు కాస్త శ్రద్ధ తీసుకుని నా భర్తను వెతికి పెట్టాలని కోరుకుంటున్నా.

– హేమావతి, కదిరి

25 నుంచి చెస్‌లో ఉచిత శిక్షణ

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని కళాజ్యోతిలో ఈనెల 25 నుంచి మే 25 వతేది వరకు చదరంగం(చెస్)లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాజ్యోతి చెస్ డైరెక్టర్ శింగనమల రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 8 ఏళ్లుగా ఉచిత వేసవి చదరంగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు కనీసం 8 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. శిక్షణ అనంతరం టోర్నమెంట్ నిర్వహించి వారికి బహుమతులు అందిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్దనున్న విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణంలో సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈమేరకు పుట్టపర్తి ఈఈ, ధర్మవరం డివిజన్ ఏడీఈ లక్ష్మినరసింహారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి హాజరవుతారని తెలిపారు. ధర్మవరం డివిజన్ పరిధిలో వినియోగదారుల సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ



గ్యాస్ ప్రమాద నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



పరికరాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి రాజు

పుట్టపర్తి టౌన్: అవగాహనతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి హేమంత్‌రెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణ సమీపంలో ఉన్న అగ్నిమాపక శాఖ కార్యాలయంలో సిబ్బంది మాక్ డ్రిల్‌తోపాటు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా బయటపడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై తెలియజేశారు. ఏడీఎఫ్ఓ నాగరాజు నాయక్ పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బంది ఉపయోగించే పరికరాలు, వాటి పనితీరు ఎలా ఉంటుందనేది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: పట్టణంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.గ్యాస్ లీక్ అయినపుడు ఏం చేయాలో అగ్ని మాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాములు, ఇంచార్జ్ ఫైర్ ఆఫీసర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుధం కంటే శక్తివంతమైనది కవిత



మాణిక్యం శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ కృష్ణప్ప, కవులు, ప్రముఖులు

పుట్టపర్తి: కవిత ఆయుధం కంటే శక్తివంతమైనదని డీఈఓ కృష్ణప్ప, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ కవులు పేర్కొన్నారు. చిత్రావతి సాహితీ కళాపీఠం, సేవా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయకుడు మహమ్మద్ మాణిక్యం ఇసాక్ రచించిన మాణిక్యం శతకం(ద్విశతి)"పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మాణిక్యం శతకం సమాజానికి నైతిక విలువలు, మానవత్వపు విలువలను తెలియజేస్తుందన్నారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే సమకాలిన ఆధునిక కవితలు రాయటం ఇసాక్ సొంతమని అమర చంద్రబాబు పేర్కొన్నారు. ఇసాక్ కవితలు దేశభక్తి, సామాజిక స్పృహ, మత సామరస్యానికి తలమానికలుగా నిలిచిపోతాయని భావన ప్రియ సాహితీ అధ్యక్షుడు హైదరాబాద్‌కు చెందిన కవి చక్రవర్తి అభివర్ణించారు. కవులకు కులం, మతం, ప్రాంతం తేడాలుండవని మాణిక్యం శతకం కర్త ఇసాక్ అన్నారు. కార్యక్రమం బెంగళూరు వాసి నరసింహమూర్తి, చిత్రావతి కళా పీఠం వ్యవస్థాపకుడు శివయ్య, పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, కవులు ఈడిగ ముద్దన్న, కొండసాని రజిత, రిటైర్డు అధ్యాపకులు కడప లక్ష్మీనారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్టు టీడీ జయరామిరెడ్డి, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, భీమనేని జనార్దన్, విజయ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం

హిందూపురం టౌన్: ఒక పక్క ఎండలు.. మరో పక్క ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం హిందూపురం పట్టణంలో కురిసిన వర్షం కొద్దిపాటి ఉపశమనాన్ని కలిగించింది. ఓ మోస్తారు వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

గాలీవానకు నేలరాలిన మామిడి



కమతంపల్లి వద్ద రాలిపోయిన మామిడి కాయలు

గాండ్లపెంట: మండలంలోని కమతంపల్లి, కటారుపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి గాలీవానకు మామిడికాయలు నేలరాలాయి. సాయంత్రం నుంచి ఈదురుగాలులతో కూడి వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయని వ్యాపారులు వాపోయారు. రూ.వేలు వెచ్చించి తోటలు కొనుగోలు చేశామని, అసలే పూత లేక అరొకరగా ఉన్న కాయలు కూడా నేలరాలాయని కమతంపల్లికి చెందిన వ్యాపారి సాబ్‌జాన్ ఆందోళన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



వెంగళమ్మ చెరువులో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



బత్తలపల్లి చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

పుట్టపర్తి అర్బన్: వెంగళమ్మచెరువు హోలీసిటీ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ మైఖేల్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల డ్రామాలతో ఆకట్టుకున్నారు. అనంతరం పాస్టర్ ఏసుక్రీస్తు బోధనలను చదివి వినిపించారు.

తాడిమర్రి: స్థానిక ఈసీఐ, హెబ్రోన్ చర్చిలతోపాటు పిన్నదరి, నిడిగల్లు, మవరపల్లి, చిల్లకొండయ్యపల్లి, దాడితోట తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపు కున్నారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు క్రైస్తవుల పవిత్ర గ్రంథం బైబిల్ చదివి వినిపించారు. స్థానిక ఈసీఐ చర్చిలో ఫాదర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజున శిలువపై ప్రాణాలు విడిచిన ఏసుక్రీస్తు ఈస్టర్ రోజున తిరిగి ప్రాణం పోసుకుని ప్రజల మధ్యకు వచ్చారన్నారు. మరణంపై ఏసు సాధించిన విజయానికి గుర్తుగా ఈస్టర్ పండుగను జరుపు కుంటారన్నారు.

బత్తలపల్లి: మండల కేంద్రంలోని క్రీస్తు ఆరాధన మందిరంలో ఫాల్‌రాజన్, ఎల్ఈఎఫ్ చర్చిలో ఫాల్, సుదర్శన్ చర్చిలో సుదర్శన్, బేతనీయ ప్రార్థనామందిరంలో ప్రతాప్, రివైవల్ చర్చిలో రూపాసు హాసిని ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. గుమ్మళ్ళకుంట, తంబాపురం, సంగాల, నెత్తివారంపల్లి, ముష్టూరు, సంజీవపురం, మాల్యవంతం తదితర గ్రామాలలోసైతం ఈ వేడుకలను నిర్వహించారు.

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని కింగ్స్, హోలీసిటీ, షాలోమియా చర్చిల్లో ఈస్టర్ డే వేడుకలు పాస్టర్ అరుణ్‌కుమార్, రాజారత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



పుట్టపర్తి షాలోమియా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన యువతిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... గేమేనాయక్ తండాకు చెందిన తులసేనాయక్ క్రాస్ దగ్గర ఉన్న బంక్ వద్ద పెట్రోల్ పట్టించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. జాతీయ రహదారిపైకి రాగానే వెనుక నుంచి మరో బైక్ వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో తులసేనాయక్‌కు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందే మాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని స్థానిక 30 పడకల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కదిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి..

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీ నగర్ సమీపంలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పావగడ – పెనుకొండ ప్రధాన రహదారిపై కారు – ద్విచక్ర వాహనం ఢీకొనడంతో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. ఆదివారం పెనుకొండ వైపు నుంచి భర్త నరసింహమూర్తితో కలిసి ఆర్.లోచెర్ల గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అయితే పావగడ వైపు నుంచి ధర్మవారానికి చెందిన ఓ వ్యక్తి కారు.... బైక్ ను ఢీ కొంది. ఈ ఘటనలో వర్షిణి (25) తీవ్రంగా గాయపడింది. స్థానికులు 108 కు సమాచారం ఇచ్చారు. 108 వాహన టెక్నీషియన్ తిరుపతయ్య యువతికి ప్రాథమిక చికిత్స అనంతరం పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

శనీశ్వరుని దర్శనం కోసం పాదయాత్ర



రొద్దం నుంచి పావగడకు పాదయాత్ర చేస్తున్న భక్తులు

రొద్దం: మండల కేంద్రంలోని రొద్దం పెద్దాంజనేయస్వామి దేవాలయం నుంచి శ్రీరామ యువజన భక్త మండలి ఆధ్వర్యంలో దాదాపు నాలుగు వేలమంది భక్తులు పావగడ శనీశ్వరాలయానికి పాదయాత్రగా బయలు దేరి వెళ్లారు. ఆదివారం ఉదయమే అర్చకులు గిరీష్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వావసునామ సంవత్సరం చైత్ర బహుళ సప్తమిని పురస్కరించుకుని పావగడలోని శనీశ్వరున్ని దర్శించుకుంటే మంచి జరుగుతుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి పాదయాత్రను ప్రారంభించారు.



ఎన్పీకుంటలో కొత్తరోడ్డు వద్ద జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పొంచి ఉన్న ప్రమాదం

ఎన్పీకుంట: మండల కేంద్రానికి సమీపంలోని కొత్త రోడ్డు వద్దగల కాలనీలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ ప్రవహించే ఫీజు బాక్సులు చేతికి అందే ఎత్తులో ఉన్నాయియి. ట్రాన్స్‌ఫార్మర్‌కి కంచె కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పుకణికలు రావడంతో ఇళ్లు కాలిపోయిన ఘటనను గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైన విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదం లేని చోట ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వైభవం.. సల్లాపురమ్మ జ్యోతుల ఉత్సవం



అలంకరణలో సల్లాపురమ్మ దేవత



జ్యోతులు, బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం



పోతురాజు విన్యాసం

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో ఆదివారం సల్లాపురమ్మ జ్యోతుల ఉత్సవం వైభవంగా సాగింది. వేలాది కుటుంబాలు ఉన్న గ్రామంలో ప్రతి ఇంటి నుంచి జ్యోతులు, బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి వాటిని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను అమ్మవారికి సమర్పించిన అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులు పెద్ద ఎత్తున బియ్యం, బేడలు, ఆకు వక్క తదితరాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద పోతురాజు విన్యాసాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన తినుబండారాలు, ఆట బొమ్మల అంగళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.